

# పరం పదము

ఎడతెగని మానసికక్షోభతో మింటికేసి చూస్తున్నాడు. నింగి తన నీలిరంగును పోగొట్టుకొని దూరంగా మెరిసే కొద్దిపాటి తారలతో నల్లగ కనిపిస్తుంది. ఆకాశం అంతగా నిర్మలంగా వుంటె రఘుపతిగారి మనస్సు నడిసముద్రములో దిక్కుదిక్కుమంటూ కొట్టుమిట్టాడుతున్న నావలాగ కల్లోలపడుతుంది.

ఆరోజు జరిగిన సంఘర్షణను పరిశీలించడం మొదలెట్టాడు.

పుత్రుడు శేఖరాన్ని ప్రశించాడు తను.

"ఇదంతా నిజమేనా"

57—వ పేజీ చూడండి

# పరంపదనం

8 వ పేజీ తరువాయి

"అవును. నిజమే" శేఖరం నెమ్మదిగా జవాబిచ్చాడు.

"నిజమట నిజం! ఆమాత్రం బుద్ధి ఉండొద్దూ. నీకు పరువూ, మర్యాద లేకుంటే మాకుమాత్రం అక్కరలేదా? మా మర్యాదకాదా మంటకలిసేది?"

'మీ గొప్పతనాలు మీవద్దే ఉంటాయి. నా గౌరవం చెడిపోదు. మీ ప్రతిష్ఠకు లోటుగా ఎందుకు భావిస్తున్నారో నాకు....."

"నీకెట్లా తెలుస్తుంది. నీ ఇష్టమొచ్చినట్లు నువ్వు చేసుకుంటావు. మేమంతా మట్టిలో కలవాలవా? డాక్టరు ప్రకాశంగారి సంబంధము బంగారంలాంటిది. అన్నివిధాలా సరియైనది. నీ భవిష్యత్తు ఎంతో బాగుపడుతుంది. నువ్వు ఎవతెనో నాకు కోడలిగా కట్టిపెట్టాలనుకున్నావు. నీ దురదృష్టం" ఉప్పెనలా కోపం ఒక్క ఉదుటున పొంగింది.

"నాదికాదు దురదృష్టం. ప్రేమించిన యువతినే వివాహమాడాలనుకోవడం నా అదృష్టం. మీరు నిశ్చయించిన గొప్పింటి సంబంధము తప్పిపోవడం మీ దురదృష్టమే కావచ్చు" నిశ్చయంగా శేఖరం జవాబిచ్చాడు.

"ఛీ.....ప్రేమించాడుట, వెధవ ప్రేమ! దాని పిచ్చిలోబడి దానికి గర్భంచేసి, దాని బెదిరింపులకు లొంగి తీరా ముంచుకొచ్చిన తర్వాత పెండ్లి చేసుకోవాలనుకొంటున్నావు."

"చాలా పొరపడుతున్నారు నాన్నగారూ. మేమిద్దరం ప్రేమించుకొన్నాము. ఒకరికొకరం వాగ్దానం చేసికొన్నాం. అప్పుడే వివాహానికి మాకు ఇష్టంలేకపోయింది. కాని మా ప్రేమకలాపం ఇంతవరకు పరిణమించింది. నామనస్ఫూర్తిగానే పెండ్లికి ఒప్పుకుంటున్నాను. గిరిజను మీరు చూచారు. ఆమె చదువు, స్థితిగతులనుగూర్చి విన్నారు. నేను వివాహమాడకుంటే ఆమెజీవితం నాశనమౌతుంది. ఒక స్త్రీ జీవితాన్ని బలిగొన్నవాడినౌతాను. నా జీవితంలో ఇలాంటి అన్యాయానికి నే నెప్పుడూ ఒప్పుకోను! నేను చేసిన పొరపాటల్లా—మా ప్రేమను మీకు ముందే తెలియపరచకపోవడం. అందుకు మీరు నన్ను మన్నించాలి. మమ్ములను కరుణించాలి." శేఖరం కండ్లకు నీటి ముత్యాలు అడ్డుగా నిల్చాయి. మాటలు కొక్కొరపడి బొంగురుగొంతునుండి దీనంగా వచ్చాయి.

తన పుత్రుని అసహాయస్థితికి తనేమీ మాట్లాడలేకపోయ్యాడు.

—

రఘుపతి విచారంలో మునిగి ఆలోచిస్తున్నాడు.

రఘుపతి రిటైర్డు ఇంజనీరు. అతని కుమారుడు శేఖరం మెడిసిన్ చదువుతూ, గిరిజను ప్రేమించాడు. ఆమెనే వివాహం చేసుకుంటానని ఆరోజు తండ్రితో వాదించాడు. కానీ, తండ్రి దృష్టి తన అంతస్థుకు, హోదాకు తగ్గట్టు దూరంగా గొప్పింటి మీద పడింది. డాక్టరు ప్రకాశం తన బాల్య మిత్రుడు. ఇప్పు డీ ఉద్యోగ అధికారాలతోపాటు తమ స్నేహబాంధవ్యము మరింతగా పెరిగిపోయింది. తన కొడుక్కు ఆయనగారి కూతురు అరుణకు ఈడూ జోడూ బాగా సరిపోతుంది. ప్రకాశం తనమాటను త్రోసివేయజాలడని యోచించాడు. ఈసంబంధానికే ప్రాముఖ్యత నిచ్చాడు రఘుపతి.

రఘుపతి చేతివ్రేళ్ళమధ్య చుట్ట కాలుతూ పొగ వస్తూవుంది. వెల్లకిలా పండుకొని ఎత్తైనదిండుపై ఏటవాలుగా తలవాల్చి ఆకసంకేసి చూస్తున్నాడేకానీ, అతని మనస్సంతా ఆలోచనాగ్నితో దహించుకపోతుంది.

ఒక నక్షత్రం క్రిందికి రాలుతూ మధ్యలోనే మాయమైంది.

ఆకసంలోకి విచ్చుకున్న ఔటు వింతశబ్దంతో పగిలి, రంగుల్ని వెదజల్లి, చివరిగా పొగరూపంలో మాయమైంది.

ఆలోచనలకు అంతరాయంకలిగి ఔటు మ్రోగిన దిశకు తల త్రిప్పాడు రఘుపతి. పారిపోయే పొగ కనిపించింది.

ఆ ఔటుకు తన జీవితానికి సంబంధమేలేదని గమనించాడు రఘుపతి. ఔటు భూమిమీద ప్రేలి, ఆకాశాని కెగిరి శబ్దం చేస్తూ, తన గుణాలన్నింటినీ ఒక్కసారి వెదజల్లి క్షణికంలో పొగగా మారిపోతుంది.

రఘుపతి జీవితం సాఫీగా నడిచింది. గంట్లు పడినప్పటికి తప్పించుకున్నాడు. ఆ గంట్లు విశిష్ట రూపాన్ని పొందలేకపోయాయి. కానీ ఒక్కటి బలిపీఠంలాంటిది మిగిలిపోయింది. అది గుర్తుకొచ్చేసరికి అతని గుండె కలుక్కుమంది. ముప్పదియైదు సంవత్సరాలు సుడిగుండాలులాగు వెనక్కు మళ్ళాయి.

* * *

జూనియర్ ఇంజనీరుగా బి. ఇ. పూర్తికాగానే రాజమండ్రి మొట్టమొదటిసారిగా అపాయింట్ చేశారు తనను. తను ఆపట్టణానికి రావడం అదే మొదటిసారి. ఒంటరిగా ఒక రూము తీసుకున్నాడు. తనకి శ్రీమతి రాలేదు. అంటే అసలింకా పెళ్ళనేది కాలేదు. ఆరోజు సోమవారం ఉద్యోగంలో చేరాడు తను. మొదటి రెండురోజులు ఆఫీసునుండి రాగానే రూమును తనకు వీలుగా మార్చుకున్నాడు. తరువాత తనకేమీ తోచేదికాదు. పట్టణమంతా క్రొత్తగానే వుంది. ఇంకా స్నేహితులంటూ ఏర్పడలేదు. విరామకాలంలో ఏం చేయాలన్నది ఒక పెద్ద ప్రశ్నై కూర్చుంది.

ఒక సాయంత్రము పార్కుకేసి నడిచాడతను.

విశాలమైన పార్కులో రేడియో మెల్లిగా మూలుగుతోంది. అప్పుడప్పుడే జనం వస్తున్నారు. బాటకిరువైపుల, అర్ధరులో, పూలచెట్లున్నాయి. మిగతా నేలంతా పచ్చికతో నిండివుంది. కొన్ని చిన్న మొక్కలు తొట్లలో పెరుగుతున్నాయి. పెద్ద చెట్లు మందంగా కదులుతున్నాయి. సిమెంటు బల్లలు అక్కడక్కడా ఖాళీగా ఉన్నాయి. బటానీలు అమ్మేవాడు మాటిమాటికి అటూ, ఇటూ తిరుగుతున్నాడు. తను కొంతకాలం ఉల్లాసంగాగడపగలిగాడు.

నాలుగోరోజు సాయంత్రం రాజమండ్రిని కబళించుకొన్న గోదావరితీరాని కెళ్ళాడు తను. చిన్న చిన్న తిప్పలులాంటి అలలు గాలికి ఊగుతున్నాయి. రాళ్ళకు ఢీకొన్న అలలు నీటి తుప్పర్లను ఎగజిమ్ముతున్నాయి. ఎర్రని సూర్య కిరణాలతో కొన్ని అలలు ఆడుకొంటున్నాయి.

పిల్లగాలులు నీటి చల్లదనాన్ని గ్రహించి ఇసుక




కీళ్ల వాతము, వాపునొప్పులు
కండరవాపులూ అలసట
మూలంగా కలిగే బాధలకు,
స్లోఅన్స్ లినిమెంట్ ఉపయో
గించండి. స్లోఅన్స్ మీ నొప్పు
లను తక్షణం దూరంచేస్తుంది.

వార్నర్-లాంబర్ట్
ఫార్మస్యూటికల్ కంపెని
(పరిబాధ్యతలతో యు.ఎస్.ఎ.లో స్థాపితము)
TEL.

**మంచి పుస్తకాలు**

జీవిత రహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామసూత్రాలు.... రూ 3-50
యువతి:- స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు ..... రూ 3-50
సంతానము.- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు...... రూ 3 50
*అమ్మక రహస్యాలు:-* వ్యాపారంలో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు రూ 6-00
*ఉద్యోగదర్శిని:-* మనదేశంలోని అన్నిరకాల ఉద్యోగాలు, అర్హతలు, పొందే మార్గాలు రూ 5-00
*ఆత్మజ్ఞానము:-* శరీరానంతరం ఆత్మను-గురించిన నవీన శాస్త్ర పరిశోధనలు. రూ 2-50
పోష్టు ఖర్చులుచితం క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి. పీ. పోస్టుద్వారా మీయింటికి పంపబడును

**దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్ర**

**మంచి రహస్యం**

గ్లోరియా ద్రవాన్ని, మీ ముఖానికి రుద్ది తుడిచినంతలో అద్భుతమైన కాంతిని, మంచి అందాన్ని వెంటనే తెచ్చును, ముఖంలోముదిరూపును పోగొట్టి చక్కని లేతదనాన్ని తెచ్చును ఎండకువచ్చే నలుపును, మొటిమలను నమ్మకంగా పోగొట్టును
వెల రూ 1-75. అన్ని షాపుల్లో దొరుకును
JANITA PRODUCTS, ELURU. A.P.






వుడ్‌వార్డ్స్
'గ్రైప్ వాటర్'
తెలివైన తల్లులు
60 ఏళ్లనుంచి వాడుచున్నారు

ఏకైక ఏజెంట్లు: కోమర్ మేన్యుఫేక్చరింగ్ కెమిస్ట్స్ లిమిటెడ్ లండను; ఎమ్.టి. సహాని అండ్ కో., (కలకత్తా) ప్రైవేట్ లిమిటెడ్ కలకత్తా; టి.టి. కృష్ణమాచారి అండ్ కో., మద్రాస్; ఎమ్.టి. సహాని అండ్ కో; (ఢిల్లీ) ప్రైవేట్ లిమిటెడ్, ఢిల్లీ;

Aiyars OP. 148 TEL.


# పరంపదము

మీదుగా ప్రయాణంచేస్తూ, అందరితోపాటు తననీ ఆహ్వానించాయి.

తను సూర్యకిరణాలచే వెండిలాగ మెరిసే నీటి అలలవైపు వెర్రిగ చూస్తూ నిల్చున్నాడు. ఒంటరిగా చూడడం కొంత కష్టంగాతోచింది తనకు. తోటి సహచరులు లేకుండేసరికి తన మనస్సుకు చిరాకు వేసింది.

ముందుకు కొంతదూరం నడిచాడు తను. పిడికిలనిండా ఇసుక తీసికొని గాలికి పాటంగా వదులుతూ ముందుకు సాగాడు. ఒక ఇసుకతిన్నెపై కూర్చుని ఇసుకను తోడుతూ, పూడుస్తూ కొంత కాలం గడిపాడు.

సూర్యుడు అస్తమించినచోట వెలుగు కనిపిస్తూవుంది. నెమ్మదిగా చేతులూపుకుంటూ కదిలాడు తను.

పున్నమిచంద్రుడు ఆతృతగా పైకి ఎగ్రాకుతున్నాడు. నక్షత్రాలు బిక్కుకంగా ప్రకాశిస్తున్నాయి.

వీధిలైట్లకాంతిలో ఏదో ఎరిగిన ముఖం కనిపించినట్లయింది తనకు. క్షణంసేపు ఊహించేసరికి బాగా గుర్తుకొచ్చింది. వెంటనే ఉత్సాహంతో చప్పట్లు కొట్టాడు. వడివడిగా పోతున్న శర్మకు పరధ్యానంలో అవి విన్పించినట్లు లేవు.

ఐదారు అంగలు పెద్దవిగవేసి చప్పట్లు తట్టి 'శర్మా' అని ఎలుగెత్తి పిల్చాడు.

రోడ్డమీదిజనం వెనక్కు తిరిగారు.

శర్మ కూడా వెనుదిరిగి చూశాడు—ఎవరా పిలిచేది అన్నట్లు.

'శర్మా' అని మళ్ళీ పిలిచి, చేతి రుమాలతో సంజ్ఞచేసి, అతనివైపు పరుగెత్తాడు తను.

శర్మ, తను ఇంటర్మీడియట్‌లో రూమ్‌మేట్స్. ఎంతో స్నేహంగా, అన్యోన్యంగా ఉండేవాళ్ళు. ఆ క్లాసు పూర్తికాగానే ఎవరిదారి వారిదయింది. తను ఇంజనీరింగుకై అనంతపురం వెళ్ళాడు. శర్మకు ఫస్టుక్లాసు రానందున బి. ఏ. లో చేరాడు. మొదటి రెండు సంవత్సరాలలో నీ ఆరునెల్లకో ఉత్తరం వ్రాసికొనటిగారు.

"హలో శర్మా"

"ఒహ్హో......రఘువా"

శర్మ, తను చేతులు కలిపారు చిరునవ్వులతో.

తను ఊహించినంతగాలేదు శర్మ. చిక్కిపోయిన శరీరం—కళ్ళక్రింద ఏవో నల్లటి చారలు—నిగూఢ రహస్య విషాదాన్ని గోచరింపచేస్తున్నాయి. కొద్దిగా ఎదిగిన గడ్డం, పరటుకుపోయిన బుగ్గలు, ముఖాన్ని కాంతిహీనము చేస్తున్నాయి. వీధిదీపాల వెలుగులో శర్మను చూడగనే తన శరీరం జలదరించినట్లయింది ఆశోభంగమ్మైనట్లు తోచింది.

"అలావున్నావేం" తను శర్మ నడిగాడు.

"ఆc......ఎన్ని సంవత్సరాలకు కలుసుకొన్నాం" తనమాట పూర్తిగాకముందే శర్మ అన్నాడు.

"చాలా చిక్కిపోయివున్నావే" తను మళ్ళీ అడిగాడు.

"దానికేముందిలే" చిరునవ్వుతో దాటవేశాడు.

శర్మ తనలోటును కప్పిపుచ్చి మాట్లాడుతున్నట్లుగా తను పసిగట్టాడు. అతనిముఖంలో తిరవి

ఆవేదన.....తీవ్రంగా చూచేకళ్ళు.................. తేని చిరునవ్వు. తనకి వింతగా తోచాయి.

"ఇక్కడ ఏం చేస్తున్నావు" తన ప్రశ్న.

"బి. ఇ. చదివి క్లర్కుగా మునిసిపల్ ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాను......మరి నీవో"

"బి. ఇ. పూర్తయింది. ఇక్కడ జూనియర్ ఇంజనీరుగా నాలుగు రోజులనుండి 'పవర్ హౌస్'లో పనిచేస్తున్నాను."

"ఓ......వెరీగుడ్" శర్మ చిరునవ్వు నవ్వాడు.

కానీ, ఆ నవ్వు కుమిలిన దుఃఖసముద్రంనుంచి వచ్చినట్లుంది తనకు.

కాలేజీ జీవితాన్ని గుర్తు చేసుకుంటూ, పాత స్నేహితుల వివరాలు తెలుసుకుంటూ రోడ్డు ప్లాటుఫారంమీద అగుతూ నడుస్తున్నారు.

ఎలక్ట్రిక్ బల్బుచుట్టూ వెలుతురుకోసం రెక్కల పురుగులు నిండా ముసురుకుంటున్నాయి. దానికి పైగా ఆకసాన్ని కప్పివేస్తూ, నల్లగా చీకటి నీడలా నిద్రగన్నేరుచెట్టు వ్యాపించివుంది. పొడలుపొడలుగా జారే వెన్నెల బల్బు వెలుగులో మాయమౌతుంది.

"అది సరేకానీ, నీలో ఏదో గొప్ప వెలితి కన్పిస్తుంది" జరిగే సంభాషణను త్రుంచుతూ. వేలాకవిధిదీపంలో అగుతూ అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ తను అడిగాడు.

"మానవు డనగానే ఏదో వెలితి సహజంగా ఉంటుంది. కానీ, నాకు ఇంత చిన్నతనంలోనే గొప్ప తీరని వెలితి కలిగింది. అంతా విధికృతము" వైరాగ్య ధోరణిలో ముఖం పెట్టాడు శర్మ. గొంతులో ఆవేదన మిళితమైంది.

తన మనస్సు చివుక్కుమంది అతన్ని ఎందుకు కదిలించానా అని. అవును. కలిదించకుంటే ఎలా? ఇంటర్మీడియట్‌లోగల అనుబంధము తొలగిపోతుందా ? మౌనంగా కాఫీహొటలు చేరారు.

"శ్రీమతిగా రింకా రాలేదా?" కాఫీ చప్పరిస్తూ తను ప్రశ్నించాడు.

"అవివాహయంలోనే తీరని వెలితి కలిగింది. కానీ..." సందేహాన్ని వెలిబుచ్చాడు శర్మ.

తను కొంచెం తొట్రుపడ్డాడు.

"మనం ఇద్దరం స్నేహితులం. ఈ నాలుగు సంవత్సరాలు విడిగా వుండిపోయ్యాం. ఇప్పుడు మళ్ళీ ఒక్కటైనాం. మన స్నేహం మళ్ళీ పూర్వంలాగే అభివృద్ధి చెందుతుంది. మరి ఏనాటికైనా నీలో కలిగిన మార్పును నేను కనుక్కోవాలి. అది 'స్నేహిత ధర్మం' తనకు తోచిన ముక్క చెప్పాడు తను.

"అవును. అదీ నిజమే. నాకునూ చెప్పవలసినధర్మం వున్నది. అందువల్ల ఏమైనా హృదయభారం తగ్గిపోతుందో ఏమో. తర్వాత చెప్తాను."

కాఫీహొటలునుంచి బైటకొచ్చారు తాము. హృదయం బరువుగావుంది. రోడ్డుమీద కార్లు, దుమ్ము, వింతమనుషులు, బండ్లఅరుపులు, కోలాహలం—అన్నీ వెగటుగా ఉన్నాయి.

"సరే మళ్ళా రేపు కలుద్దాం. అమ్మ ఒంటరిగా ఉంటుంది. టైం చాలా అయింది" అన్నాడు శర్మ.

"అలాగేలే శర్మా. ఇంటి అడ్రసివ్వు. రేపు నేనే మీ ఇంటివద్ద కలుస్తాను" అడ్రసు నోట్ చేస


# సర్కార్స్ పాలిటెక్నిక్

## మచిలీపట్టణం

(స్థాపితం: 1956)

గవర్నమెంటు టెక్నికల్ పరీక్షలకు, సివిల్, మెకానికల్, ఎలెక్ట్రికల్ శాఖలలో లోయర్, హయ్యర్ గ్రేడు కోర్సులు, సిటి అండ్ గిల్డ్సు (లండన్) రేడియో సర్వీసింగ్ పరీక్షలకు శ్రేష్ఠమైన శిక్షణ ఇవ్వబడుచున్నది. కనీసార్హత ఎస్.ఎస్.ఎల్.సి. ఈ పరీక్షలలో ఉత్తీర్ణులైనవారికి కేంద్ర, రాష్ట్ర ఇంజనీరింగ్ డిపార్టుమెంట్లలో మంచి ఉద్యోగములు గ్యారంటీగా దొరకగలవు. గొప్ప విద్యార్హతలు గల అనుభవశాలురైన ఇంజనీర్ల చే నడిపించబడుచూ రాష్ట్రమంతటిలో హెచ్చు ఫలితములు ఫస్టుక్లాసులు, పొందుటకు ప్రఖ్యాతిగాంచిన సంస్థ. వివరములకు 50 న. పై.లు పంపుచూ, ప్రిన్సిపాల్‌కు వ్రాయండి.

ఎన్. బి. జ్ఞానప్రకాశం, ఎం. ఇ., ఎ. ఎం. ఐ. ఇ.
ప్రిన్సిపాల్ (రి. సూపరింటెండింగ్ ఇంజనీరు)



## అందమైన షాంపూ...
## రామణీయమైన కురులు — ఈ రెండూ
## మీకు పామాలివ్‌లో లభించును!




పామాలీవ్ షాంపూ మేలురకము కొబ్బరి నూనె చేర్చబడిన ప్రఖ్యాతిగాంచిన మిశ్రమము. అందుచేత దానిలో సమృద్ధియగు నురుగు ఆరోగ్యకరముగు కేశములను పెంపొందించు శక్తి గలదీ పామాలీవ్ దుమ్ముదు పోగొట్టి కేశములను శుభ్రపరచును. అది మీకు అహ్లాదకరమును చేకూర్చి, ఆరోగ్యకరముగు కేశములు పెరుగుటకు తోడ్పడును. ఆధునిక భారత స్త్రీలు తమ శిరోజములు మనోహరముగా నిగనిగలాడుచు పట్టువలె మృదువుగా నుండుటచే పామాలీవ్‌కు ప్రాముఖ్యత నిత్తురు.

పామాలీవ్ యొక్క సమృద్ధియగు నురుగు పొడుగాటి కేశములకు అందము చేకూర్చును

ఉపశమనకు ప్రత్యేకమైనది

కాంథర్ డ్రైన్



హేరాయిల్



బెంగాల్
కెమికల్
కలకత్తా
బొంబాయి
కాన్పూరు

మద్రాసు స్టేట్ కు డిస్ట్రిబ్యూటర్లు.
M/S ఆర్. ఎల్. గొండర్ & కో.,
59, బందర్ వీధి, మద్రాసు.

ఆంధ్ర డిస్ట్రిబ్యూటర్లు:
M/S సత్యనారాయణ ఫార్మసీ,
కుమ్మరివీధి, విజయవాడ_1 & విజయనగరం



బిడ్డ
లివర్ వ్యాధిని
ముదరనీయ
వద్దు

వ్యాధి లక్షణాలు కనిపించగానే
జమ్మివారి టానిక్ తీసుకోండి
పిల్లల లివర్, స్ప్లీన్ వ్యాధులకు
చికిత్స చేయుటలో వారికి 60
ఏళ్లకు పైగా అనుభవమున్నది.



జమ్మివారి
లివర్‌క్యూర్

పసిబిడ్డల లివర్, స్ప్లీన్ వ్యాధులకు పరమౌషధము

జమ్మివారి డాక్టర్లు ముఖ్యమైన పట్టణాలకు ప్రతి నెలా వస్తారు.
వివరాలకు వ్రాయండి :

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్

హెడ్ ఆఫీసు : మద్రాసు-1.

బ్రాంచిలు : బొంబాయి-4 — బెంగుళూరు-2 — కలకత్తా-7 — ఢిల్లీ-6 —
మంగళగిరి — లక్నో-1 — నాగపూర్-1 — పాట్నా-1 —
తిరుచిరాపల్లి-2 — విజయవాడ-2 — విజయనగరం.

JV 15 TE


# పరంపదము

కున్నాడు తను. 'గుడ్‌నైట్'లు చెప్పుకొని ఇద్దరూ విడిపోయ్యారు.

వాడిపోయిన ముఖంతో అంతులేని తలపులతో 'మార్యంపేట' మీదుగా పోయాడు తను. దారిపొడవునా పూర్వాలోచనలు తన మస్తిష్కాన్ని ఆందోళన పరిచాయి. తనకుమటుకు తాను స్వతంత్రంగా జీవించాలనేవాడు. ప్రతి విషయంలో బాదరబందీ లేకుండా ఉండాలి. తనకు పట్టుదల అనేది అనవసరం. కావాలనుకున్నవని జరగనీ, లేకపోనీ ఆ కార్యాన్నిగూర్చి బాధపడేవాడుకాదు. ఆ కార్యానికి ప్రయత్నం చేయులేదనుకొనేవాడు. దాని లాభ నష్టాలు ఒక్కసారి విచారించేది. అంతే. దాన్ని తన దృష్టిపథం నుంచి తప్పించేది. అందుకే తనలో ఏదో ఉత్సాహం ఎప్పుడూ వున్నట్టు తోస్తుంది. కానీ, తనలోని కోర్కెలను నెరవేర్చాలనుకొనేవాడు. అవి ఎటువంటివైనాకానీ, ఎదుటివారిని నొప్పించకుండా ఉండేందుకు ప్రయత్నించేవాడు. ఎక్కువ పరిచయమున్నవారితోతప్ప మిగతావారితో ముక్తసరిగా మాట్లాడేది. తరచు చుట్టపక్కాల ఇండ్లకు వెళ్ళేవాడుకాదు. దానితో వాళ్ళు లేనిపోని అపోహలు కల్పించేది. "వీడు మహా పెద్ద చదువు చదువుతుంటాడని", "గర్వంగా ఉంటాడని", "చుట్టాలతో సరిగా మాట్లాడడని", "చూచీ చూడనట్లు పోతాడని" ఏవేవో గుసగుసలు తనకు వినిపించేవి. తను వాటన్నింటినీ పాటించేవాడు కాదు. తనకు తోచినవిధంగా ఉండేవాడు. అనవసరంగా ఇతరుల జోక్యానికి వెళ్ళేవాడుకాదు.

తల్లిదండ్రులతో సహకరించేవాడు. వాళ్ళ ఆజ్ఞలను తన కర్తవ్యాలుగా భావించేవాడు. ఇష్టముండినా, లేకపోయినా "ఇది నా విధి' అని విసుగు కస్సరచకుండా ఆ కార్యాన్ని పూర్తిచేసేవాడు. ప్రతి విషయాన్ని యోచించేవాడు. తల్లిదండ్రులు తనకు పుట్టుక నిచ్చారు. ఎందుకు తనను పుట్టించారు? పెంచారు? కష్టసుఖాలలో ముంచారు? వంశాభివృద్ధి కొరకా? పిల్లలనుచూచి ఆనందించేందుకా? వృద్ధాప్యంలో తమని పోషిస్తారు అని? లేక కేవలం ....... లేక......ఏమో..............

మానసికగ్లాని కలిగినపుడు మనసు, నిరాశచెంది కష్టంగాఉన్నపుడు—తనపుట్టుకదేనికోసం? కేవలం మాతా పితలను శిరసావహించడమా? ధనాన్ని సంపాదిస్తూ తన పుట్టుకలాగే ఇంకొకరికి జన్మ నివ్వడమా?

ఆ ఆలోచనలకు అంతూ పంతూ అంటూలేదు. ఎక్కడి వక్కడ తెంచివేశాడు తను. తన అభిప్రాయాలను తదనుకూలంగా మార్చుకున్నాడు. సాధ్యమైనంతవరకు సాఫీగా చూడతలచాడు.

పూర్తిగా ఆలోచించి, హృదయానికి కష్టమైనవిగాకుండా, శరీరానికి, మనస్సుకు, సుఖాన్నిచ్చే అవకాశాన్ని చూసుకొంటూ, ఇతరుల మనస్సు నొప్పించకుండా అందరితోపాటు సంఘంలో తనుగూడ గ్రుడ్డిగా బ్రతకను మొదలుపెట్టాడు.

నెమ్మదిగా రూము చేరాడు తను.

* * *

తన అత్యుతకొద్ది సాయంత్రం ఆఫీసునుండి రాగానే స్నానంచేసి, హోటల్లో కాఫీత్రాగి తర్న అత్రమునకు నడిచాడు తను.

రేడియో విషాదసంగీతంతో మునిగిఉన్నాడు

శర్మ. తోళ్ళ చప్పుడుతో శర్మ తనను గమనించి ఆహ్వానించాడు. తనుకూడా ఆ సంగీతంలో మౌనం వహించాడు.

"షికారు వెళ్దాం శర్మా" అన్నాడు తను, అసలు బాధను తెలుసుకోవాలన్న ఆతృతతో.

"వెళ్దాం ఉండు......కాఫీ కానీ" శర్మ అన్నాడు.

కాఫీ అయివాక నదీ తీరాన్ని చేరాం.

గోదావరినీళ్ళు, నీళ్ళ కంటుకొని ఇసుక, చెట్ల మధ్యగా ఎత్తయిన కొండలు, సూర్యునికి అడ్డుగా తెల్లటి మబ్బులు, మబ్బులోంచి వెండి కిరణాలు, ఆపైన విశాల ఆకాశము—అందులో ఏదో లోటు కనిపిస్తుంది.

సూర్యుడు తన కర్తవ్యాన్ని ముగించేందుకు త్వరపడుతూ, అలసటతో ఎర్రగా మారిపోతున్నాడు.

బండల కానుకొని ఇసుకలో కూర్చున్నారు తాము. ఇద్దరిమధ్య నిశ్శబ్దం నిండింది. దూరాన ఊళ్ళో కార్ల శబ్దాలు, సినీ రికార్డులు మసక మసకగా కళ్ళకు కన్పించినట్లు వినిపిస్తున్నాయి. ఎలా ప్రారంభించాలో అర్థం గాకుండా ఉంది తను పరిస్థితి.

కొంతకాలానికి శర్మ సంభాషణ సాగించాడు.

"ఇప్పుడు నా గురించి జరిగిన విషయాన్ని నీ గుండెలోనే దాచుకో" తన ముఖంవైపు చూశాడు శర్మ.

గొంతులోని ఆవేదన, ఆ మాటల్లోని నిగూఢత తనహృదయాన్ని చలింపజేశాయి.

అలాగే అన్నట్లు వెర్రిగ తల ఊపాడు తను.

"ఇంటర్మీడియట్ పరీక్షలయినంతవరకు మనం ఒకటిగఉన్నాం. సాహిత్యాభిలాషతో బి.ఏ.లో చేరాను. మొదటి రెండు సంవత్సరాలు మనిద్దరిమధ్య కొద్దిగా ఉత్తరాలు నడిచాయి. తరువాత మనకు ఏ సంబంధము లేకుండా పోయింది. బి. ఏ. పూర్తికాగానే సెలవుల్లో మా తండ్రి గతించాడు. ఫలితంగా ఎం. ఏ. చదువలేకపొయ్యాను. మా అమ్మప్రోద్బలంతో మరునటి సంవత్సరము మా పెదనాన్నగారు కుదుర్చిన సంబంధము చేసుకున్నాను. భార్యపేరు సుశీల."

ఎప్పుడో ఎక్కడో విన్నట్లుగా తోచింది ఆపేరు తనకు.

"నీకూ శుభలేఖ పంపించాను, పాత అడ్రసుకి. నీవద్ద నుంచి జవాబేరాలేదు. సుశీలది నెల్లూరు. దూరపు చుట్టరికమున్న. మామగారు అనంతపురంలో లెక్చరరుగా పనిచేస్తుండినారు."

తన గుండెల్ని ఏదో కెలికినట్లుగాఉంది. శర్మేమో నిబ్బరంగా చెప్పుకుపోతున్నాడు.

"ఆసంవత్సరమే మామగారిని నెల్లూరికి మార్చారు. ఆ ముందుసంవత్సరమే ఆయన డిమాన్‌స్ట్రేటరునుండి లెక్చరరుగా ప్రమోషను పొందారు. నెల్లూరులోనే వివాహమైంది. మే మిద్దరం అన్యోన్యంగానే ఉంటూ వచ్చాం. పెళ్ళిఅయిన మరుసటి నెలలో అమ్మ, నేను, సుశీల మ్రొక్కుబడి తీర్చుకొనేందుకు భద్రాచలం వెళ్ళాం. ఎండలు విపరీతంగా ఉన్నాయి. దేవాలయానికి నడుస్తూ నడుస్తూ సుశీల మధ్యలో స్పృహతప్పి పడిపోయింది. డాక్టరుదగ్గరికి తీసికెళ్ళాం. గర్భిణి అని తేలింది. నా భార్య సుశీలకాదు. "దుశ్శీల" పెద్దగా, బాధగా అరిచాడు శర్మ—రెండు కొండలమధ్య నలిగేవాడిలాగా, నిప్పు స్రావంతో కడసారి అరిచినట్లు. ఇంకా నిబ్బరంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాడు. కానీ, ఆ మాటలు అతని గుండెల్లోంచి దూసుకు వచ్చి తనగుండెల్లో దిగబడుతున్నాయి.

"అప్పటినుంచి మాకు ఆమెమీద అనుమానం పెరిగింది. కారణం—పెండ్లైన నెలకే నాలుగునెల్ల గర్భిణిగా తయారైంది. లోకానికి వెరచాం. సంఘానికి భయపడ్డాం. మాలో ఒకవిధమైన అసంతృప్తి పెరిగిపోయింది. అశాంతికి గురైనాము. రాబోయే అవమానాన్ని గురించి ఆలోచించాము. మా అమ్మ నన్ను పూర్తిగా శంకింపజేసింది. నా భార్య ఇంత అవినీతికి పాల్పడిందని నమ్మలేకపొయ్యాను. మా అమ్మ సూటిపోటి మాటలనేది. ఆ వారంరోజుల్లోనే నా భార్య శవం బావిలో తేలింది"

దట్టమైన నల్లటి మేఘాలు సూర్యుడ్ని తరుముకుంటున్నాయి. గాలివేగం పెరుగుతూ వచ్చింది.

ఇద్దరి కండ్లలో నీళ్ళు నిండుగా ఉన్నాయి. ఇసుకలో వ్రేళ్ళు దూర్చేందుకుకూడా కష్టమైంది తన పరిస్థితి.

"ఇదిగో ఈ లేఖ చదువు. నా భార్య నా కిచ్చిన కడపటి సందేశము" శర్మ జేబునుండి ఒక లేఖను తీసిచ్చాడు.

"నీవే చదివి వినిపించు" తడబడుతూ అన్నాడు తను.

"లేదు. నీవే చదువు. నేను మళ్ళీ చదువలేను."

తను మనస్సులోనే చదివాడు.

"ప్రియమైన భర్తగారికి,

నన్ను పతితగా భావించారు. అది నిజమే. కండ్లు కనుపించని కామాంధకారములో ఈ దుస్థితికి పాల్పడ్డాను. అది ఎటువంటి పరిస్థితికి దిగజార్చేది ఇప్పుడు కన్పించింది. మీ హృదయాన్ని ఎంతగానో గాయపరిచాను. మిమ్మల్ని క్షమాపణ కోరదలిచాను. కానీ, అది ఏనాటికైనా మీ హృదయంలో మంట చెలరేగదీసి అశాంతికి ఎరచేస్తుంది. నాకీ లోకంలో శాంతి దొరకదు. నే నింతకంటే బ్రతికి అనుభవించాల్సిందేమీలేదు. మీ ప్రతిష్ట భంగపడకుండుటకై లోకుల నోళ్ళల్లో నానకముందే మిమ్ముల విడిచిపోతున్నాను. నేను అధఃపతనములో క్రుంగిన దానను. నన్నెంతగానో ప్రేమించారు. అనర్హురాలనైనాను. మీ జీవితాన్ని బలి చేసుకోకండి. పునర్వివాహమాడి సౌఖ్యంగా జీవించాలని ప్రార్థిస్తున్నాను.

తుది నమస్కారములు.

అభాగిని

సుశీల"

కన్నీటిబొట్లు లేఖను తడిపాయి. లోకమంతా గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. హృదయం మీద సమ్మెటపోట్లు తగులుతున్నాయి.

ఆకాశంలో మేఘాల ఒత్తిడి ఉధృతమౌతోంది.

ఆ వ్రాత సుపరిచితం—సుశీలది. లెక్చరరు రామనాథం కుమార్తె. తను అనంతపురములో చదివేటప్పుడు తొలి పరిచయము, మధురానందము లింతగా తటస్థించాయి. తనఅభిప్రాయాలకు తోడుగా క్షణికసౌఖ్యానికి పాల్పడింది. తను గ్రుడ్డిగ వ్యవహరించాడు. ఆమెకు గర్భంవస్తే? తననే వివాహమాడ తలచుకుంటె? ఆ రెంటికీ తను జడుసుకున్నాడు.


# క్యాలెండర్లు

నాణ్యమైన ఫోటో ఆఫ్‌సెట్ క్యాలండర్లకు మమ్ము సంప్రదించండి. క్యాలండరు బొమ్మలను క్యాలెండరు మ్యానుఫ్యాక్చరర్లకు, ప్రింటర్లకు ప్రత్యేక ధరలకు సప్లయి చేయుదుము.
మంచిక మీ షనుపై పని చేయుటకు సమర్థులైన ఏజంట్లు కావలెను. వ్రాయండి.

**AJANTA ARTCALENDAR Mfg. Co.**
*P. B. 255, MADRAS—1.*
or P. B 962, Calcutta-1.


# RATNAM'S N-OIL


(వైపూతకు మాత్రమే)

అంగసంములు బలహీనత చెంది, చిన్నదనపు తిరిగి యధాప్రకారం అంగ పూర్తి సౌఖ్య మనుభవించుటకు 50 సం॥ ప్రఖ్యాతి కలది. 1 సీసా రూ. 10 లు వి. పి. 1-4-0 కోరలసినవారు ముందుగా 1-4-0 పంపేది. ఇందులో స్పెషల్ రకం అర్జంటుగుణమునకు రూ. 25-0-0 లు.

డాక్టర్. రత్నం సన్స్, (Estd 1904)
మలక పేటబిల్డింగ్స్, అజంపూరా మార్కెట్ వద్ద, హైదరాబాద్-24 (ఆంధ్రప్రదేశ్)






# పరంపదము

తర్వాత ఆమెను కలుసుకోనేలేదు. రామనాథం వెల్లూరుకు ట్రాన్సఫర్ అయినట్లు విన్నాడు తన హృదయంలో అలజడి తగ్గింది తేలికగా ఊపిరి పీల్చగలిగాడు అవన్నీ తన కళ్ళల్లో గిర్రున తిరిగాయి.

కానీ సుశీల వివాహం, తన ముఖ్య మిత్రుడితో జరిగింది—తనకు తెలియదు అవమానానికి గురై ప్రాణాన్ని తీసుకుంది. శర్మ జీవితాన్ని కూలద్రోసింది. ఎవరు దీనికి కారకులు? తనా? సుశీలా?

తన కోర్కెలు అటువంటివి—గుణాలు అంతే. పూర్తిగా దిగజారినవిమ్మట పతనస్థితి కనిపిం చింది మనోదౌర్బల్యమే కారణము స్వార్థం పెచ్చు పెరిగింది ఇతరుల జీవితాల్ని నాశనం చేసింది.

వేడి నిట్టూర్పులు విడిచి లేఖను తిరిగి ఇచ్చి వేశాడు తను.

సూర్యుడు తన కర్తవ్యాన్ని ముగించాడు. మబ్బులు చెల్లాచెదురుగా అరిచాయి—సూర్యుడు దొరకలేదని.

మళ్ళీ చెప్పను మొదలెట్టాడు శర్మ

"నా భార్యను ఎంతగానో ప్రేమించాను ఆమెను శంకించినపుడు ఆమెపట్ల నా ప్రవర్తన వింతగానే మారింది. ఆ విషయాన్నిగూర్చి నా హృదయం మథనపడింది దానికొక రూపం రాకముందే నా భార్య నన్ను విడిపోయింది పశ్చాత్తాపంపొందిన భార్యను రక్షించుకోలేకపోయ్యాను. నా కళ్ళముందే ఆత్మహత్య చేసుకున్నట్లయింది. గ్రుడ్డివాడ్నిగా తయారయ్యాను. దూరపుకొండలు నునుపులాగ నా భార్యమీది ప్రేమ మరింతగా పెరిగింది. మానవు లన్నాక జీవితంలో ఎన్నో తప్పులు చేస్తారు అవి వాటంతటవే జరిగిపోతాయి. సుశీల నన్ను నడి సముద్రంలో ముంచివెళ్ళింది దుర్బలస్థితికి జారి పోయ్యాను మా అమ్మ నా దిగులుతో పూర్తిగా కృంగిపోయింది కుటుంబమే పతనమైనట్లుగా తోచింది నా జీవితానికి ఒక్క అమ్మ మిగిలింది. ఆమెనన్నా సుఖపెట్టాలి పాతవిషయాలను మర్చి పోవాలని గుండె దిటవుచేసుకున్నాను. కానీ అది సాధ్యం కాలేదు అందుకే ఊరుమార్చి ఇక్కడికి వచ్చాం. కాల మెక్కువయ్యేసరికి విచారంలోకి జారే వాడ్ని. ఉద్యోగంలో చేరాను ఎనిమిది నెలలు పూర్తి కావచ్చింది"

రొప్పుతున్నట్లు ముగించాడు శర్మ

అతనికేంతెల్సు, తన స్నేహితు డిటువంటివాడని! తనకే ఎందుకు చెప్పాడు? ఇది రహస్యంకాదా? తనే అతని భార్యచావుకు కారణం అని తెలుసా? తెలిస్తే తనను క్షమిస్తాడా? తను నిర్భాగ్యుడు. స్వార్థ పరుడు కాలకూటవిషం తనలో నిలువునావుంది. ఆవిషమే అతని కుటుంబాన్ని కాల్చివేసింది

నిజంగా తనలో మానవత్వం మిగిలివుందా? పశు వుగ మానవరూపంలో ఉన్నాడా తను తన ఆశయా లకు, అభిరుచులకు, ఆలోచనలకు తృప్తిపడేవాడు. తుచ్ఛ ఆలోచనలు, నీచపు అభిరుచులు, పిచ్చి ఆశ యాలు, నీచుడు, తుచ్ఛుడు తను

ఉన్నట్లుండి ఒక ఉరుము 'ఢగేల్'మని మెరుస్తూ పెద్దగా ఉరిమింది

అందులోంచి వచ్చి పిడుగు తన నెత్తిన పడలేదే, గోదావరి చిన్ననీటి అలలు సముద్రపు కెరటాల

తాగు ఘోష పెడుతున్నాయి. ఆకాశం పడమటి భాగం పూర్తిగ మేఘావృతమై నల్లబడింది. చినుకులు దూరాన్నుంచి తరుముకొస్తున్నాయి.

శర్మవైపు చూశాడు తను.

దీర్ఘంగా యోచిస్తున్నాడు, నల్లటి మబ్బుల్లోంచి ఉదయించే చంద్రునికేసిచూస్తూ.

నిజానికి తను అంత నీచుడా? తన రాతిగుండెకు బాధగా తోచలేదు. తన మనస్సుకు పొరబాటుగా జరిగినట్లు కనిపించింది. అందుకే తను అంతగా నిందించుకొన్నాడే! తన కటికగుండె ఒప్పుకోలేదు. తనపరిస్థితికి తాను హేళనగా నవ్వుకున్నారు.

తన ప్రవర్తన, మనస్తత్వం కేవలం స్వార్థానికి పరిమితాలు. అందరి దారులకంటె వింతగ కన్పించింది. శర్మ ఇక ఆవిషయాన్నిగూర్చి బాధపడాల్సిందేనా? ఆబాధతోనే అతని జీవితం గడిచిపోవాల్నా?

ఒక దుస్సంఘటన సంభవించింది. అందులోనే ఎదురీదితే ఒడ్డును చేరకుండా. అతను జీవితంలో అనుభవించాల్సినవి లేవా? శర్మకు సలహా ఇచ్చేందుకు తనకు ధైర్యం చాలలేదు. హృదయానికి తట్టలేదు. కాని తనమార్గంలో తను బ్రతికి సాధించాల్సిందేమిటో?

నిశ్శబ్దంగా వెళ్ళిపోయ్యారు.

అభాగినిగూర్చి స్మృతి కలిగిందంటే తన గుండె కలుక్కుమనేది.

* * *

గత జీవితఘట్టం రఘుపతిగారి మనస్సులో అగ్నిజ్వాలగా దహించింది. శరీరమంతా స్వేదబిందువులు కారసాగాయి.

తను వేడిరక్తంలో, జీవితానుభవంలేక ఆఘోర విషాదాన్ని హేళనగా చూడగలిగాడు. అది తన హృదయంలో గట్టిగ ముద్ర వైచుకుంది. కాని అప్పటి అనుభవాలు—తను ఎక్కి దిగిన మెట్లవల్లాలు— ఒక పంతులుడు అని చెప్పుతున్నాయి. నిస్సహాయ స్థితిలో చంటిపిల్లాడిలా కన్నీళ్ళు కార్చాడు రఘుపతి.

ఒకస్త్రీ జీవితాన్ని నాశనం చేశాడు తను. ఒక కుటుంబాన్ని అధఃపాతాళలోకానికి త్రొక్కాడు. కాని తనపుత్రుడు నిర్భయంగా, దృఢంగా ప్రేమించిన స్త్రీని రక్షించాలని తనను వేడుకొన్నాడు. ఎదిరించాడు. తను తెలిసీ మళ్ళీ తప్పుచేయబోయ్యాడు. తనలో ఇంత కాఠిన్యం మేదినుండులాంటిది — తనను క్షమాభిక్ష కోరుకున్నాడు, తన పుత్రుడు. తను తండ్రిహోదాని వెలగబెట్టాడు. శేఖరాన్ని అవమానపరిచాడు. అంధకారంలోకూరుకుపోయ్యాడు. తన వజ్రంలాంటి కొడుకుతో తను సరితూగగలడా? అతని శరీరం సిగ్గిలింది.

అతని మస్తిష్కంలో ఒక మెరుపు మెరిసింది. రోమాలు గగుర్పొడిచాయి. దేహమంతా ఒక్కసారిగ పులకించింది.

ఆరిపోయిన చుట్టను విసిరివేశాడు.

రఘుపతి తటాలున లేచి, ప్రక్కగదికెళ్ళి నిద్రపోతున్న శేఖరాన్ని తట్టి లేపి "నీ ఇష్ట ప్రకారమే గిరిజను పెండ్లిచేసుకో" అని తన హృదయారాటాన్ని తీర్చివేశాడు. ★


తెల్ల మచ్చలు

(మరియు దేహముమీది ఇతర మచ్చలకు)

ఎంతకాలంగానైన లేక ఏకారణములవల్లనైనా దేహముమీద ఏర్పడిన మచ్చలను నివారించుటకు, విశేష పరిశోధనలమూలంగా తయారైన "శ్విత్ర మోచన" ఔషధము చక్కగా ఉపయోగిస్తుంది. అనేక గ్రంథాల పరిశీలన మరియు విశేషపరిశోధనల ఫలితమైన యీ ఔషధం వాడడం ప్రారంభించిన కొద్దిరోజులలోనే తృప్తికరమైన ఫలితాన్నిస్తుంది. అనేక యోగ్యతా పత్రములుపొందినది ధర రు. 8/-మాత్రము. లోపలికి పుచ్చుకొనుటకు రు. 10/-పూర్తికోర్సు రు32 మచ్చల వివరాలు తెలుపుచూ వెంటనే మాకు వ్రాయండి. ఉత్తరములు ఇంగ్లీషులో వ్రాయవలెను. భారత ప్రఖ్యాత నిపుణులు,

Vaidyaratna Sri Satyarthi (P-I) P. O Lalbigha (Gaya).

